# ఆకలేసింది

-ఇచ్ఛాపురపు రామచంద్రం

ఆరేళ్లది - హఠాత్తుగా ఆరున్నొక్కరాగం ఎత్తుకుంది. ఆ ఎత్తుకోడం కూడా అలా గిలాగ కాదు. వినేవాళ్ల చెవులు చిల్లులు పడేలా... ఇంటికప్పు విరిగి పడేలా.

ఆ గుడిసె - బీదతనానికి బొమ్మలా - ఛండాలంగా ఉంది. సినిమాల్లో అయితే పేదరికం కూడా మెరిసిపోతుంది కాని నిజం దరిద్రం చాలా అసహ్యంగా ఉంటుంది. అలాటి - బాగులేని నేపథ్యంలో ఆ పాప ఏడుపేమీ బాగులేదు. అసలు - ఏడుపే ' అందమైన సినీ తారలూ, అతి చిన్న పిల్లలూ తప్ప యింకెవరేడ్చినా బాగుండదు. అందులోనూ పేదవాళ్ళేడిస్తే పరమ అసహ్యంగా కూడా ఉంటుంది.

ఈ దేశంలో పేదరికం వుండకూడదు. పేద ఏడుపు లసలే ఉండకూడదు. క్లీన్ అండ్ గ్రీన్. పచ్చగా రిచ్చిగా ఉండాలంతే. అది రూలు. అందుకే ఆ పాప ఏడుపాపించాలి.

"పాపా, పాపా! ఎందుకేడుస్తున్నావ్?"

"అమ్మ కొట్టింది"

అమ్మకొట్టిన దుఃఖం, తేలుకుట్టిన బాధ కంటే కూడా ఎక్కువ - పిల్లలకి. తల్లి కొట్టే దెబ్బ పిల్లకి వొంటిమీద కొంచెమూ, మనసు మీద గట్టిగానూ తగులుతుంది. అమ్మ నన్ను కొట్టడమా! అమ్మే నన్నుకొడితే యింకెవరు కొట్టరు? - అనిపిస్తుంది పిల్లలకి. అందుకే అంతెక్కువ ఏడవడం.

ఏదేమైనా సరే - ఏడవకూడదు. చిన్న పిల్లయినా సరే.

ఆ పిల్ల అలా ఏడిచేలా కొట్టిన అమ్మ శిక్షార్హురాలు. అదిగో ఆ అమ్మ గుడిసెలో చీకటిగా ఉన్నా అమ్మ మాత్రం బాగానే ఉంది. కాని ఆమె కూడా ఏడుస్తోంది! నిశ్శబ్దంగానే ఏడుస్తోంది.

బలే. మొగుణ్ని కొట్టి మొగసాల కెక్కిందన్న సామెత ఉంది కానీ, పిల్లని కొట్టి తల్లేడ్చిందన్న సామెతుందా? ఏమో అనవసరం. కావలసింది సామెతలు కాదు. నేరానికి శిక్ష. పిల్లని కొట్టిన తల్లికి శిక్ష. అమెరికాలో ఐతే యిది చాలా పెద్ద నేరం. ఎంత గ్లోబలైజేషనయినా ఇదింకా ఇండియాయే కనక కొంతవరకు ఆటలు చెల్లు తున్నాయి. ఇదే అమెరికాలో అయితే యీ అమ్మా యీ పాటికి జైలులో కూర్చునేది. పిల్లల్ని కొట్టడమా! బార్బేరియస్. ఇది అమ్మ కాదు, రాక్షసి.

"అమ్మా! అమ్మా! నువ్వెందుకు పిల్లని కొట్టి ఏడిపిస్తున్నావ్".

కుక్కనయినా సరే - ఉరి తియ్యాలంటే, ముందు దాన్ని పిచ్చి కుక్క అనాలి. అమ్మని శిక్షించాలన్నా ముందుగా నేను విచారణ చేసినట్లు నటించాలి. ఉదారవాదం.

"అది... ఆ దెయ్యం... మూర్ఛపాయలు మింగేసింది" అని మళ్లీ ఆమె దుఃఖించ సాగింది.

"పావలా కాసు మింగేస్తేనే పదిమంది డాక్టర్ల దగ్గరకు పరుగెత్తాలే! ఐదు నక్షత్రాల కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పావలా పైకి తీయడానికి పది వేలు ఖర్చు పెట్టాలే! నువ్వేమిటి నిమ్మకి నీరెత్తినట్టు హాయిగా కూర్చుని కన్నీరు కారుస్తున్నావ్? నువ్వు నిజంగా అమ్మవేనా లేక బ్రహ్మరాక్షసివా? నీలో మాతృ హృదయం లేదూ. నువ్వు సినిమాలు, టీవీ సీరియళ్ళు చూడవూ? అమ్మ ప్రేమ నీకు తెలియపోతే అది చూసయినా నేర్చుకోలేవూ?"

ఆ ప్రశ్న కామె - ఏడుస్తూనే ఫక్కున నవ్వింది. నవ్వు పోతూనే ఏడిచింది. ఏడుస్తూనే విరగబడి నవ్వింది. ఆమెది ఏడుపు నవ్వు. నవ్వేడుపు.... అహ ఏడుపే ఏమో.

"నీకేమన్నా పిచ్చా? ప్రశ్నడిగితే జవాబు చెప్పక ఏడుస్తూ నవ్వు తానేం? నవ్వుతూ ఏడుస్తావేం!" గద్దించే సరికి - ఇటు తల్లీ, అటు పిల్ల కూడా ఏడుపాపేశారు. వెలుగుతో పాటు సడి కూడా కరువై ఆ గుడిసె మరింత భయంకరంగా అయిపోయింది.

"ఎలా చెబితే అర్థమౌతుంది! నేను గతంలో సినిమాలు చూశాను. టీవీ సీరియల్సు చూశాను. తల్లి ప్రేమ, సెంటిమెంట్లు తెలిసిన దానినే. కాగితం

ముక్కమీద రుజువు చూపించడం లేదు. కానీ కొంచెం చదువుకున్న దాన్నే.. కాని యిప్పుడు నాకు చదువు, ప్రేమ, సెంటిమెంట్లు, వెలుగు, సుఖం, మంచితనం... నీతి సంస్కారం.. అన్నీ అబద్ధాలే..." ఆమె కంఠంలో కసి ఎవరిమీదో?

"మరి – నిజమేమిటి?"

"ఆకలి. దానికి మూల కారణంవైన పేదరికం.. ఆకలి ముందు అన్నీ బలాదూరే. ఆకలి ముందు అన్నీ అబద్ధాలే"

"నువ్వేమేమిటో మాట్లాడుతున్నావ్"

"నా మాట లర్థమవాలంటే నా గతం వినాలి. అది వినాలంటే – నాకు ఓపిక రావాలి. అంటే... ఓపిక రావాలంటే... కొంచెం టిఫినూ, టీలు యివ్వాలి. నేను తింటూంటే నా పిల్ల ఊరుకోదు. అంచేత దానికి కూడా తెప్పించాలి. అవొచ్చే వరకూ నేను నోరు తెరవను, ఏడవడానికి తప్ప" కచ్చితంగా అంది.

కాలం ఎంత మారిపోయింది! అందరూ డబ్బు వెనక పరుగే. ప్రతిఫలం లేనదే ఒకరి మాట వినరు, ఒకరితో మాట్లాడరు! ఆర్థిక సంబంధాలే తప్ప మానవ సంబంధాలనేవి లేవు. దేశం మీద ఆర్థిక సంస్కరణల ప్రభావం చాలానే ఉంది.

తల్లీ పిల్లా టిఫిను తిన్నాక... ఆమె చెప్ప సాగింది. "నా పేరు శ్యామల. దాని పేరు దీప. ఒకప్పుడు నేను మనిషినే.

"ఇప్పుడు"

"మరని. మనీమెషీన్‌ని. కాని కావలసినంత మనీని చేయలేక పోతున్నాను. ఇలా కాదు. నా చరిత్ర కథలా చెబుతాను. లేకపోతే మీ కర్థం కాకపోవచ్చు. ఆ... పదేళ్ల కిందటే నేను మనిషినయింది. ఆడపిల్లకి పెళ్లితోటే జీవితం సమాప్తమూ ఔతుంది. బతుకుకూ మెదలౌతుంది. అప్పటికి నాకు ఇరవయ్యేళ్లు. నది – సముద్రంలో చేరితేనే సాఫల్యం చెందినట్లు, ఆడపిల్లకి పెళ్లయితేనే మనిషిగా జమ వేసే యీ సమాజంలో – నాకు పెళ్లి చేసి తలెత్తుకోవాలని నాన్న చాలా యాతన పడేవాడు. అప్పటికే – ఇంధనం లేని వాహనంలా ధనం లేని జీవితమూ నడవని రోజులొచ్చేశాయి. ధరలూ, పన్నులూ రోజు రోజుకీ పెరిగి పోసాగాయి. సర్వీసు ఛార్జెస్ అంటూ దొడ్డితోవన అదనపు భారాలు పడసాగాయి జనం మీద. గ్యాస్ విద్యుత్ ఛార్జీలు... ఒకటేమిటి... సామాన్యుల నిత్యావసర వస్తువులన్నీ ధరలు విపరీతంగా పెంచేసుకుని మధ్య తరగతి వాళ్ల మెడలు విరిచెయ్య సాగాయి. విలాస వస్తువులు మాత్రం ధరలు తగ్గేవి. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు, ఉన్న వారినే వాలంటరీ రిటైర్‌మెంట్, కంపల్సరీ రిటైర్‌మెంట్, టెర్మినేషన్‌ల పేరిట బయటకు పంపేస్తున్నాయి సంస్థలు. కంప్యూటర్లు వొచ్చి ఉద్యోగుల చేతికి చిప్పలిచ్చాయి తమ చిప్స్‌తో. మానాన్న మంచివాడే. మా వంశమూ మంచిదే. నేను అందమైన దాన్నే. అయినా నాకు పెళ్లవడం లేదు. మిగిలిన అన్ని వస్తువులతో పాటు వరుల ధరలు కూడా పెరిగి పోయాయి. డబ్బున్న వాడికే అల్లుడు. పుచ్చు వంకాయా, చచ్చు వరుడూ కూడా ఎంతో కొంతివ్వక పోతే రారు. ఎలాగైతేనేం, నాకో పుచ్చు వంకాయ దొరికాడు. ఏభై వేల కట్నానికి. నాకు పెళ్లి చేసి – ఆర్థికంగా దివాలా తీసి – తట్టుకోలేక. మా అమ్మా నాన్నా చచ్చి పోయారు. నిజానికి చచ్చిపోయారు కనుక బతికి పోయారు కాని బతికుంటే చచ్చిపోయే వారే".

"ఎందుకని"


"ఇంకెందుకు? డబ్బుల్లేక ఇవాళ – మనుషులు ఆక్సిజన్ లేకపోయినా బతక గలరేమో కాని అర్థం లేకపోతే అర నిముషం బతకలేరు. తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి, కట్టే బట్ట, ఉండే గుడిసె – ఏదయినా అందేది డబ్బునిచ్చిన వేస్తేనే కదా?"

"ఔనౌను. చెప్పు".

"గంగ కద్దరి మేలు, ఇద్దరి కీడు ఉంటాయా అన్నట్టు పుట్టిల్లు నిప్పచ్చరమైతే, అత్తిల్లు ఐశ్వర్యంతో తులతూగుతుందా? నాకూ అయింది పెళ్లనుకుందుకే తప్ప నేనక్కడ పెద్దగా సుఖ పడిందేమీ లేదు. అతనో టీవీ మెకానిక్. అతనికో తల్లి. అతను పెళ్లయినా వొళ్లు దగ్గర పెట్టుకు పనిచేసే వాడు కాదు – బాధ్యత గుర్తించ లేదు. స్నేహితులతో అర్థరాత్రి వరకు తిరిగి అవసరానికి ఆలి దగ్గరకొచ్చేవాడు. అన్నం మాత్రం అమ్మే పెట్టేది. ఏదో పెళ్లయిందనే తప్ప అతనికి భార్య

పట్ల, బతుకు పట్ల పెద్ద పట్టింపేమీ లేదని నాకు తొందరలోనే తెలిసిపోయింది. అటెవరూ లేరు. ఆశ్రయం లేదు. కనుక యిక్కడే యిమిడి పోయాను. పుట్టింటి ఆశ లేదుగా!

ఒకటి రెండేళ్లు తిండికీ బట్టకీ ఏదోలా గడిచాయి. సంపాదన సంగతెలా ఉన్నా



పురుషత్వానికి లోటు లేదుగా. నేను గర్భవతినయ్యాను. గుమ్మం దాటి వెళ్లే అవసరం లేదు కనుక - ఆడదాన్ని కనుక - అమ్మనవ్వాలనే ఉంది మనసులో. కాని పిల్లని పస్తులుంచాలేమో అని భయం. అంతకీ మనమెుహాలకి పిల్లలేమిన్నాను. గర్భస్రావం చేయించుకుందుకు డబ్బులేక - గర్భం మోశాను. ఆర్థిక సంస్కరణల ధర్మమా అని - ప్రయివేటీకరణ మహత్యమా అని - ధర్మాసుపత్రులు కూడా వ్యాపార కేంద్రాలుగా మారి, యూజర్‌ఛార్జీలని, అవనీ, ఇవనీ, మధ్య తరగతి వాళ్లకి వైద్యం అందకుండా నడ్డి విరుస్తున్నాయప్పటికే అందులోనూ - గర్భస్రావమంటే వైద్య సిబ్బంది నిలువునా దోచేస్తారే. అందుకు వెరచే ఊరుకున్నాను.

మొదటి నుంచీ వార్తాపత్రిక చదవడం, పత్రికలు చూడడం అలవాటే. అలాగే ఎవరింటికో వెళ్లి టీవి కూడా చూసే దాన్ని. దాంతో జీవితం మీద కొంచెం అవగాహనా, ఎక్కువ అపోహ కూడా పెరిగాయి. ఉండీ ఉండీ 'జీవితానికేదో ఐపోతోంది' అనిపించేది. డబ్బనేది డాలర్ రూపంలోనో, రూపాయి రూపంలోనో - జీవితాన్ని అవతలకి తోసేసి దాని స్థానాన్ని ఆక్రమిస్తుందనిపించేది. అంతలో - పులిమీద పుట్రలా మా అత్తగారి ఆరోగ్యం చెడింది.

"ఇంకేం? అత్త లేని కోడలుత్తమురాలు"

"అది భ్రమ. టీవి సీరియల్స్, సినిమాలు, సాహిత్యము, అలా చెబుతాయి కానీ దానిలో అతి తక్కువ నిజమే ఉంది. డబ్బు కోసం, దానిమీద అధికారం కోసం అలాంటి పోట్లాటలు జరగొచ్చు. ఆడవాళ్లంటేనే అభద్రతా భావం. డబ్బు భద్రతిస్తుందని ఆశ. అందుచేత కొంత రగడ. మాకు డబ్బు లేదు. కనుక మేమిద్దరమూ అత్తా కోడళ్ళలా కాక తల్లీ కూతుళ్ళలాగే ఉన్నాం. ఇప్పటి సీరియల్స్‌లోలా ఒకరి మీద ఒకరు కుట్రలు పన్నుకోలేదు. హాయిగానే ఉండే వాళ్లం. ఆ వేళ 'చూడు శ్యామలా! ఈ జబ్బు - నాకొచ్చిన

జబ్బు... దీనికి ధనదాహం ఎక్కువ. దీనిని శాంతింపజేసేంత డబ్బు, వాడు జీవితమంతా కూడా సంపాదించలేడు. బతికి నేను సాధించేదీ ఏం లేదు. నా బెంగల్లా నీ గురించే. వాడు నాకొడుకే అవొచ్చు కాని వొట్టి బాధ్యతలేని వాడు. నేను కూడా లేకుండా ఎలా బతుకుతావో. వాడికి తెలియకుండా ఐదు వేలు దాచాను. నా అనంతరం నువ్వు తీసుకో. పురిటి ఖర్చుకుంటాయి. నీకు మాత్రం ఎవరున్నారు?" అన్నారు అత్తగారు. 'ఆ ఐదు వేలు పెట్టి మీకు వైద్యం చేయిస్తాను' అన్నాను నేను. అందుకావిడ నవ్వి - 'నాది వందల, వేల జబ్బు కాదు. చాలా ఖరీదైంది. ఇంక ఆలోచనలు పెట్టుకోకు. నేను చెప్పినట్లు చెయ్యి' అని చేతిలో చెయ్యి వేయించుకుంది. నాకు ఏడుపొచ్చింది. డబ్బులేక ఒక మనిషి జబ్బుకు బలిదానం చేసుకోడం! ఎంత దారుణం! వెధవ డబ్బు కింత అధికారమా మనుషుల మీదా, వారి ప్రాణాల మీదా! ఆవిడని చూడ్డానికే తప్పు చేసినట్లుండేది.

ఆవిడ చనిపోయింది. మరో పదిహేను రోజులకి ప్రసవించాను. దేవత లాటి అత్తగారి పేరే పెట్టాను అమ్మాయికి. నేనింకా ఆవిడ మరణ శోకం నుంచి తీసుకోకుండానే నా నెత్తిమీద మరో పిడుగు పడింది.

"ఏమిటి?"

"మగవాడిది గాలివాటం అంటారు. ఐతే కొందరు పెళ్లయ్యాక స్థిరం తెచ్చుకుంటారు. మరికొందరు తండ్రి అవడంతో కుదురు తెచ్చుకుంటారు. మా వారు ఆ రెండు కోవలకీ కూడా అతీతులని నిరూపించుకుంటూ ఒక చీటి వదిలి వెళ్లిపోయారు. ఆ చీటిలో 'ఈ సంసారాన్ని నేనీదలేను. నా స్వేచ్ఛకి భంగంగా ఉంది. సంపాదన మునుపటిలా ఉండడం లేదు. ఎంత సంపాదనా సంసారానికి చాలడం లేదు. నాకు ఈ జీవితం విసుగ్గానూ, భయంగాను కూడా ఉంది. అందుకే వెళ్లి పోతున్నాను. అమ్మ డబ్బు తీసు కుంటున్నాను" అని ఉంది.

నాకు - ఆశ్చర్యంలో ఏడుపు కూడా రాలేదు. ఇలాటి మనుషులు, మగవాళ్లుంటారా నిజంగా! ఎవరి గురించీ ఆలోచించకుండా తన మీద ఆధారపడిన వారి బాధ్యత వహించకుండా, భార్యనీ, పురిటి పిల్లనీ వదిలి - అలాంటి కారణం కోసం ఎవరేనా వెళ్లిపోతారా?

ఎవరి సంగతో ఎందుకు. కళ్ల ముందు జరిగింది. ఇక నమ్మకేం చేసేది? నా ముందు రెండు మార్గాలున్నాయి. నేను చనిపోవడం.. లేదా ఎలాగో బతుకు ఈడ్వడం. ఒంటరినైతే ఆలోచించక అక్కర్లేక పోయేది. నా మెడకో డోలుంది కదా. పిల్ల. చచ్చి నట్లు బతకాలి. సరే బతకడం ఎలా? చదువులేక, అనాథ అయిన ఆడవాళ్లకి మన కథలూ, నవలలు, సినిమాలు చూపించిన మార్గాలు - మొదటిది అప్పడాలూత్తుకోడం, రెండోది వంట మనిషిగా వెళ్లడం.

నాలో యింకా యౌవన బింకం ఉంది. కాస్త అందంగానూ ఉంటాను. అందుచేత భర్తలకి జడిసి నన్నే యిల్లాలూ వంటకి పెట్టుకోలేదు, ఎంత అవసరం ఉన్నా. పైగా నేనెక్కడి కెళ్లినా పిల్ల ఉంటుంది. అది వాళ్లకి న్యూసెన్సు. అప్పడాలని తేలిగ్గా తీసి పారేస్తాం. అవి తేలికగానే ఉంటాయి. కాని వాటి తయారీకి పెట్టుబడి అవసరం. ఆయన ఉంటే మంగలెందుకు? అదీకాక ఈ మధ్య ఆవకాయ, బంగాళాదుంప చిప్సు, అప్పడాలూ కూడా మల్టీ నేషనల్ కంపెనీలవే మరిగాంట జనం. నేను తయారు చేసినవి దేశవాళీ అని కొనరట. యాచకో యాచక శృతుః అంటారు కానీ ఆడవాళ్ళ కది ఎక్కువగా వర్తించదేమో. నా మీద జాలి పడి ఒక వృద్ధురాలు నన్నొక కంపెనీకి పరిచయం చేసింది. ఇల్లిల్లూ తిరిగి వారి ఊరగాయలూ, చిప్సూ మొదలనవి అమ్మాలి. అమ్మిన దాని మీద కమిషను ఉంటుంది. నేను తిరిగేటప్పుడు పిల్లనావిడ చూసేది.

ఆడది అమ్మకాలకు రోడ్డున పడడం ఈ దేశంలో శాపమే. బీడీల ప్రకటనలకు కూడా బాడీ అంతా చూపించే టీవీల ధర్మమా అని - కాస్త అందంగా ఉన్న ఆడది అమ్మ బోతే ఆమె అమ్మే వస్తువులని కాక ఆమె శరీరాన్ని అడుగుతారు అమ్ముతావా అని. అమ్మే ఆడది అనాకారయితే - ఆమె అమ్మజూపే సరుకులని కూడా అడగరు. అమ్మకాల బతుకులో ఎదురైన అవమానాలు అన్నీ యిన్నీ కావు. అయినా మరో మార్గం కనపడదు.

ఆ కంపెనీ నా మీద నమ్మకం కుదిరి సరుకుని నా యింటి దగ్గర వుంచినా ఒకటి రెండు రోజులకేమీ అనరు. కమిషను పెంచారు. రోజుకో పూట తినగలుగు తున్నాం. ఆర్థిక సంస్కరణలు నాలాటి ఆడదాన్ని రోడ్డున పడేసినా ఎలాగో జీవన పోరాటం చేస్తున్నాను. ఎందుకు? దీని కోసం. నా భర్త నన్నొదిలి పోయినట్టు నేను నా పిల్లనొదిలి పోలేక. ఆ జ్ఞానం దీనికి లేక పోతోంది. నేను పడే యాతనంతా దీనీ కోసమే అన్న జ్ఞానం లేదు".

"ఇంకా చిన్న పిల్లేకదా"

"పేదరికానికి బాల్యముండదు. బీద పిల్లలకి ముద్దుముచ్చట లుండవు. ఆరేళ్ళొచ్చాయి. చిన్న పిల్లేమిటి?" సాయం చెయ్యకపోతే మానె నా పీకల మీదకి తెస్తే ఎలా చచ్చేదీ?"

"ఏం చేసింది? ఆ రూపాయలు మింగడ మేనా? ఐనా ఆ పిల్లకందేలా ఎందుకు పెట్టాలి?

"ఈ గుడిసెలద్దె దీనికేభయ్ రూపాయలయితే అందకుండా దాచుకోవచ్చు. ఇలాంటి పాకలో ఆ నేనెక్కడ దాచేదీ? కడుపులో పెట్టుకోవాలంతే.. "మళ్లీ ఏడుపు మొదలెట్టింది."

"మూడు రూపాయలు కాదు... నిజానికి ముప్ఫయి రూపాయలు"

"అదేమిటీ? ఆ వయస్సు పిల్లలు రూపాయి కాసులే మింగరు పొరపాటున తప్ప. అలాంటిది ఏకంగా ముప్ఫయి కాసులు మింగిందంటే.."

అప్పటికి నోరు తెరిచింది పిల్ల... "నేవేమీ రూపాయి కాసులు మింగలేదు"

"రూపాయి కాసులు మింగితే బాగానే ఉండును. తల తాకట్టు పెట్టేనా తీర్చేసే దాన్ని.

మండిపడిందామె పిల్ల మీద.

"మీరేమో మింగిందంటున్నారు. మీ పాపేమో మింగ లేదంటుంది. ఎవరి మాట నిజం?"

"రూపాయి కాసులు మింగలేదు. ఉంటే మింగే రాక్షసి - దానికి ఆకలెక్కువ. అత్తగారి పేరు పెట్టుకున్నందునా ఆ దేవత మంచి గుణాలొక్కటి రాలేదు".

"నాకంతా అయోమయంగా ఉంది"

"విడమరచి చెబుతాను వినండి. మా బతుకులకి ఒకే చోట పదిహేను రూపాయల బేరం తగలడమంటే పండుగ. నిన్న ఒకావిడ వేపర్స్ రెండు పాకెట్లు తెమ్మంది. ప్యాకెట్ ఖరీదు పదిహేను రూపాయలు. పట్టుకెళ్ళి యిద్దామని పొద్దున్నే తెచ్చాను. తెల్లారితే నీళ్ళ మోత తప్పదు కదా. నేను నీళ్లకెళ్లి వొచ్చేంతలో యీ దెయ్యం బ్రహ్మ రాక్షసిలా రెండు పాకెట్లు కానిచ్చేసింది"

"ఆకలేసింది " దీనంగా అంది పిల్ల.

"ఆకలేస్తే? మనదోకాదో చూసుకోకుండా తినేడమేనా? మరీ అంత చిన్న పిల్లలేమీ కాదే. నా బతుకెలా బండలయినా నిన్నేనా చదివించి, పనులు నేర్పి ప్రయోజకురాలిని చేద్దామను కున్నాను. ఊహలూళ్లేదితూంటే కర్మ గాడిదలు కాసిందంటారిదే. నేనిప్పుడు కంపెనీకి ఇరవై ఏడు రూపాయలు కట్టాలి. ఎక్కణ్నుంచి తెచ్చేది? నీ బాబిస్తాడా? నీ తాతిస్తాడా? అంటూ ఆ పిల్లని పట్టుకుని బాదసాగింది. తానేడుస్తూ పిల్లని కొట్టసాగిందామె.

"ఆగు... వొద్దు... పిల్లనలా కొట్టకు"

"పాపిష్టిదాన్ని. పిల్ల తిన్నందుకు కొట్టవలసిన కర్మ పట్టిన దౌర్భాగ్యురాలిని. నన్ను నేను కొట్టుకోలేక శిక్షించుకోలేక... అత్తమీది కోపం దుత్తమీద చూచించినట్టు దాని మీద చూపిస్తున్నాను. చేతకానిదాన్ని.. దేముడు నాకు చావెందుకివ్వడో? పిల్ల ఆకలి తీర్చవలసిన అమ్మని... ఆకలి తీర్చుకుందని కొడుతున్నాను. నికృష్టురాలిని".

ఏడుస్తుందామె.

ఎదురింటి మేడ మీద

ఓ తల్లి తన పిల్లని బుజ్జగిస్తోంది

"తినమ్మా తిను తల్లీ... తినకపోతే ఆకలెయ్యదు? ఆకలేస్తే నీరసం రాదూ? నీరసమొస్తే ఎలా చదువుకోగలవూ?

"నాకలి కావడం లేదు మమ్మీ!"

కొంచెం దూరంలో - ఎవరో పేపరు బయటికే చదువుతున్నారు.

"నూతన ఆర్థిక సంస్కరణల రెండవ దశ ప్రారంభమవుతుంది. ఈ దశను త్వరగా ముగించగలిగితే,' అంతవరకూ చదివి - ఆగి - తనలో తాను అనుకున్నాడు - 'మధ్య తరగతి మచ్చుకయినా మిగలదు'. ■